తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి



నందిగామ: నర్సప్పగూడలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, జిమ్స్ వైద్యులు

షాద్‌నగర్‌రూరల్: తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తాయని, బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలను పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్, దేవునిపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమన్నారు. బిడ్డపుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, అవి రోగనిరోధక శక్తిని పెంచేందుకు ఎంతగానో దోహదపడతాయని, అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే రక్ష

కొత్తూరు: తల్లిపాలే బిడ్డలకు రక్షగా ఉంటాయని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాజేశ్‌బాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లో బుధవారం జిమ్స్ హోమియోపతి, కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లిపాలతో శిశువులో సరైన ఎదుగుదల, రోగనిరోధక శక్తితో పాటు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. తల్లిపాలకు దూరమైన చిన్నారుల్లో చిన్న వయస్సులోనే ఎన్నో అనారోగ్యాల బారినపడే అవకాశం ఉందన్నారు. పుట్టిన రోజు నుంచి ఆరునెలల వరకు తప్పకుండా చిన్నారులకు తల్లిపాలు పట్టించాలన్నారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, అంగన్‌వాడీలు, హోమియోపతి కళాశాల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిశువుకు ఆరోగ్యకరం

నందిగామ: తల్లిపాలే శిశువులో రోగనిరోధక శక్తి పెంచేందుకు దోహదపడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయి అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ.. బాలింతలు బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రు పాలు తాగించాలని సూచించారు. తల్లిపాలతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ఎట్టి పరిస్థితుల్లో డబ్బాపాలు పట్టించొద్దని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు వరలక్ష్మి, కమల, సుజాత, ఆశ వర్కర్లు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

నర్సప్పగూడలో..

మండల పరిధిలోని నర్సప్పగూడలో ఐసీడీఎస్ సహకారంతో జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిమ్స్ వైద్యులు తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు విరాజ్‌కుమార్, రమ్యకృష్ణ, రోజా, భవ్యశిఖ అంగన్ వాడీ టీచర్లు శోభారాణి, ఏఎన్‌ఎం రేణుక, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: తల్లిపాల ప్రయోజనాలపై వివరిస్తున్న వైద్యులు



షాద్‌నగర్‌రూరల్: తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి

బిడ్డకు శ్రీరామరక్ష



కేశంపేట: ఎక్లాస్‌ఖాన్‌పేటలో..

కేశంపేట: తల్లిపాలే బిడ్డలకు శ్రీరామరక్షగా నిలుస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్యసింగ్ అన్నారు. కేశంపేట సెక్టార్‌లోని కాకునూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్యసింగ్ ఆధ్వర్యంలో, ఎక్లాస్‌ఖాన్‌పేట, ముదాద్‌పూర్‌లో కొత్తపేట సెక్టార్ సూపర్‌వైజర్ శమంతకమణి ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, రాములమ్మ, మాధవి, మంజుల, ఏఎన్‌ఎం పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ నిర్వహణ అస్తవ్యస్తం

కార్యదర్శిపై సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గోవిందమ్మ, వైస్ చైర్మన్ చంద్రమోహన్

శంకర్‌పల్లి: వ్యవసాయ మార్కెట్ కమిటీ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, దీనికి కార్యదర్శి నిత్యం కార్యాలయానికి రాకపోవడమే కారణమని డైరెక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ గోవిందమ్మ అధ్యక్షతన నిర్వహించగా.. డైరెక్టర్లు పాల్గొన్నారు. సమావేశంలో పలువురు మార్కెట్ కార్యదర్శి ఐశ్వర్యలక్ష్మి నిత్యం కార్యాలయానికి రావడం లేదని, ఈ కారణంగా మార్కెట్ లాభాల్లోకి రావడం లేదని తెలిపారు. అదేవిధంగా పారిశుద్ధ్య నిర్వహణ సైతం సక్రమంగా లేదని తెలిపారు. పన్నులు కడుతున్నప్పటికీ మున్సిపల్ సిబ్బంది చెత్త సేకరణ చేయకపోవడం ఏమిటని, ఇదే పరిస్థితి పునరావృతం అయితే పన్ను చెల్లించేది లేదంటూ మున్సిపల్ అధికారులకు లేఖ రాయాలన్నారు. అనంతరం గోవిందమ్మ మాట్లాడుతూ.. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో వైస్‌చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, కార్యదర్శి ఐశ్వర్యలక్ష్మి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు దాతల సహకారం



పాఠశాలకు ఐటీసీ పరికరాలను అందజేస్తున్న ఐ సడక్ ప్రతినిధులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలను సాధించాలని ఐ సడక్ ప్రాజెక్టు మేనేజర్ మహ్మద్‌అలీ ఇబ్రహీం అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ ప్రభుత్వ పాఠశాలకు ఐ సడ్ సంస్థ (రాయికల్ టోల్‌ప్లాజా) ఆధ్వర్యంలో ఐసీటీ పరికరాలు ప్రొజెక్టర్, కలర్ ప్రింటర్, కంప్యూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు సహాయ సహకారాలను అందిస్తున్నామన్నారు. గ్రామీణ విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం ఐ సడక్ ప్రతినిధులకు సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఐ సడక్ సీనియర్ మేనేజర్ విశ్వనాథ్, రాజు, కో–ఆర్డినేటర్ జగదీశ్, హెచ్‌ఎం సత్యం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ప్రమీల, గ్రామస్తులు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సుష్మాస్వరాజ్‌కు ఘన నివాళి



సుష్మాస్వరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చేవెళ్ల: బీజేపీ నాయకురాలు సుష్మాస్వరాజ్ సేవలు మరువలేనివని పలువురు నాయకులు కొనియాడారు. చేవెళ్లలో బుధవారం పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో సుష్మాస్వరాజ్ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను కొనియాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు పార్లమెంట్‌లో ఆమె చూపించిన తెగువ సాహసం మరువలేనవన్నారు. రాష్ట్ర ప్రజల గుండెల్లో ఎప్పటికీ ఆమె మరిచిపోలేని నాయకురాలుగా నిలిచిపోయారని కొనియాడారు. అనంతరం నాయకులు మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి మున్సిపల్ అభివృద్ధికి కృషిచేయాలని, దానికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో నాయకులు శర్వలింగం, శంకర్, శ్రీనివాస్, సత్యనారాయణ, అశోక్, కుంచం శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, శివ, ప్రవీణ్‌రెడ్డి, మధూకర్‌రెడ్డి, రవి, శంకర్‌చారి, వెంకటేశ్, బాల్‌రెడ్డి, గోవర్ధన్, కృష్ణమోహన్, గణేశ్, ప్రకాశ్, దామోదర్, యాదయ్య, రాఘవేందర్‌రెడ్డి, రమేశ్, జయసింహారెడ్డి, రాఘవేందర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

వాటర్ ట్యాంకుల వద్ద మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చేవెళ్ల: ఊరేళ్ల వార్డులో వాటర్ ట్యాంకుల వద్ద అధికారులు నీటి తొలగింపు, పైపుల లీకేజీ మరమ్మతుల పనులు చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని ఊరేళ్ల వార్డులో పాఠశాల ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంకుల వద్ద పైపులైన్ లీకేజీలు, వాటర్ ఫ్లో నీటితో అక్కడే నీళ్లు నిలవడంతో అపరిశుభ్రంగా మారిందని, దీంతో స్థానిక ప్రజలు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై వాటర్ ట్యాంకుల వద్ద అపరిశుభ్రత అనే శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సిబ్బందితో ట్యాంకుల వద్ద మరమ్మతు పనులు చేయించారు. ట్యాంకుల వద్ద నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ ఏఈ ప్రభాకర్ స్పష్టం చేశారు.

వసతి గృహాలకు భవనాలు నిర్మించాలి

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చేవెళ్ల: కళాశాలలో చదువుకునే విద్యార్థుల కోసం చేవెళ్లలో ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాలకు వెంటనే భవనాలు నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కళాశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయం ముందుకు వచ్చి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 2018లోనే ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాలు మంజూరయ్యాయని, అప్పటి నుంచి అద్దె భవనాల్లో నామమాత్రంగా కొనసాగిస్తూ వస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చే అద్దెలు సరిపోకపోవటంతో అద్దె భవనాలు దొరకటం కష్టంగా మారిందన్నారు. దీంతో ఈ వసతి గృహాల కొనసాగలేక మూతపడుతున్నాయన్నారు. కళాశాలలో చదువుకోవాలనే ఆశతో వచ్చే పేద విద్యార్థులకు వసతి గృహాలు లేకపోవటంతో చదువుభారంగా మారుతోందని ఆరోపించారు. వసతి గృహాలకు వెంటనే చేవెళ్లలో నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఆర్డీఓ చంద్రకళకు వినతిపత్రం అందజేశారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధికి ఆ పార్టీ నాయకులు ఎన్ని నిధులు మంజూరు చేయించారో ప్రజలకు చూపించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, మాజీ కౌన్సిలర్లు బచ్చలి నర్సింహ, కానుగు అనంతయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ హయాంలో మంజూరై శంకుస్థాపన చేసిన పనులనే తిరిగి ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్‌ఎస్ హయాంలోనే మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో సుమారు 90 శాతం అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మిగిలిన పనులు అసంపూర్తిగా ఉన్నందున వాటి కొరకు అప్పటి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ టీయూఎఫ్‌ఐడీసీకి రూ.37కోట్లకు ప్రొసీడింగ్‌లు పంపించినట్లు తెలిపారు. ఈ ప్రొసీడింగ్‌లను ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తానే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించానని చెప్పడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి ఏమిటో.. ప్రస్తుతం కాంగ్రెస్ చేస్తున్నది ఏమిటో ప్రజలు స్పష్టంగా గమనిస్తూనే ఉన్నారన్నారు. సమావేశంలో నాయకులు పిల్లి శారద శేఖర్, యాదగిరి, ఆకుల శ్రీను, సలీం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



బాధితుడి కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందిస్తున్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని లింగంధన గ్రామానికి చెందిన ముత్యాల రాములు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడిది నిరుపేద కుటుంబం కావడంతో ఈ విషయాన్ని గ్రామ కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.50లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఇట్టి చెక్కును బుధవారం బాధితుడి కుటుంబ సభ్యులకు నాయకులు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగిళ్ల ప్రతాప్, రాజేందర్, బాలయ్య, పురుషోత్తం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలోని నిరుపేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామానికి చెందిన పకీర్‌పాషా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న శ్రీకాంత్‌రెడ్డి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో రూ.2.50లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పకీర్‌పాషాకు ఆయన బుధవారం ఎల్‌ఓసీ అందజేశారు. ఎల్‌ఓసీని మంజూరు చేయించడంపై ప్రభుత్వానికి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, శ్రీధర్‌గౌడ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించడం అభినందనీయం



సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి, సిబ్బంది

సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: కోర్టు ఆవరణలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకరించడం అభినందనీయమని సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కోర్టు సముదాయంలో మున్సిపల్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి జడ్జి స్వాతిరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోర్టు కాంప్లెక్స్ సీసీ రోడ్డు నిర్మాణంతో నూతన శోభను సంతరించుకుంటుందని, కోర్టుకు వచ్చే కక్షిదారులు, సిబ్బంది, న్యాయవాదుల రాకపోకలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు కావాలని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు కోరిన వెంటనే ఎమ్మెల్యే స్పందించి నిధులు మంజూరు చేయడం హర్షనీయమన్నారు. అదేవిధంగా కోర్టు కాంప్లెక్స్‌లో బహుళ అంతస్తు నిర్మాణం కోసం రూ.8కోట్ల నిధుల మంజూరుకు ఎమ్మెల్యే ప్రోత్సాహాన్ని అందించారని తెలిపారు. అభివృద్ధికి సహకరిస్తున్న ఆయనకుకు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు, న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

షాబాద్: బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. బుధవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలోని 213 పోలింగ్ బూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో పార్టీ జెండా ఎగరాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కై వసం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. బీజేపీ ఆధ్వర్యంలో కేంద్రం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి కార్యకర్త శ్రమిస్తే విజయాన్ని అందుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్ తదితరులు ఉన్నారు.

జయశంకర్ సేవలు మరువలేనివి

తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేనివని పలువురు నాయకులు అన్నారు. బుధవారం జయశంకర్ జయంతిని పురస్కరించుకొని చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై పోరాడి ఎంతో మందిలో ఉద్యమస్ఫూర్తిని నింపారని, స్వరాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.



షాద్‌నగర్: విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నాయకులు



మొయినాబాద్: విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు



షాద్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..



చేవెళ్లలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

క్లుప్తంగా

విధుల్లో చేరిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు



తహసీల్దార్ రమేశ్‌కుమార్ సమక్షంలో విధుల్లో చేరుతున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లు

కొందుర్గు: ప్రభుత్వం ఇటీవల నియమించిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు 50 రోజుల పాటు శిక్షణ పూర్తిచేసుకున్నారు. అయితే ప్రస్తుతం క్షేత్రస్థాయి శిక్షణ కోసం కొందుర్గు మండలానికి 9 మంది, జిల్లేడ్ చౌదరిగూడ మండలానికి 6 మందిని నియమించారు. ఈ మేరకు సదరు సర్వేయర్లు బుధవారం కొందుర్గు, జిల్లేడ్ తహసీల్దార్లు రమేశ్‌కుమార్, జగదీశ్వర్ల సమక్షంలో విధుల్లో చేరారు. మండల సర్వేయర్ ఆంజనేయులు వీరికి క్షేత్రస్థాయి శిక్షణ ఇవ్వనున్నట్లు తహసీల్దార్లు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



చెక్కు అందజేస్తున్న దాత మధుసూదనచారి

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి మధుసూదనచారి రూ.1లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఆయన మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుకు విరాళానికి సంబంధించిన చెక్కు అందజేశారు. తన గురువు బూర్గుల రంగనాథస్వామి జ్ఞాపకార్థం సహకారం అందజేసినట్లు మధుసూదనాచారి స్పష్టం చేశారు. దాతకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శివనాగయ్య, గంధం ఆనంద్, ఒగ్గు కిషోర్, భూపాల్, శ్రీనివాసచార్యులు తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తూరు: మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో ఉన్న జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి బుధవారం తెలిపారు. 8వ తరగతి విద్యార్థులు షేక్ జాకి, నందిని, 7వ తరగతి విద్యార్థి చిత్ర ఇటీవల సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి జావెలిన్‌త్రో పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. త్వరలో జనగాం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విద్యార్థులు తప్పకుండా ప్రతిభ కనబర్చుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయుల బృందం అభినందించింది. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మొనాలిసా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

షాద్‌నగర్‌రూరల్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గులలో బుధవారం మైసమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల ఆటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఎముకలు, కీళ్ల సమస్యల నివారణకు ప్రత్యేక శిబిరం

చేవెళ్ల: ఎముకలు, కీళ్ల నొప్పుల సమస్యల నివారణకు శిబిరంలో వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్‌లు కూడా చేస్తామని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 10 వరకు కొనసాగుతున్న ఎముకల, కీళ్ల నొప్పుల వారోత్సవాల ప్రత్యేక శిబిరంలో బుధవారం రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ డాక్టర్ సాయివిక్రాంత్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రాంతంలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు ఆపరేషన్లు కూడా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 10వ తేదీ వరకు ప్రత్యేక శిబిరం కొనసాగుతుందని, ఎముకలు, కీళ్ల సమస్యలతో బాధపడుతున్న సద్వినియోగం చేసుకోవాలని కోరారు.